క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం



ప్రత్యేక అలంకరణలో శ్రీపార్వతీదేవి అమ్మవారు

పొదలకూరు: పొదలకూరు పట్టణానికి సమీపంలో సంగం మార్గం తోడేరు వద్ద వెలసిన శ్రీపార్వతీదేవి దేవస్థానంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి అభిషేకం, సహస్ర కుంకుమార్చన, పుష్పార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

పర్వీన్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకున్న పర్వీన్

కోవూరు: నెల్లూరు రూరల్ పరిధిలోని అల్లీపురం గ్రామానికి చెందిన రిటైర్డ్ జడ్జి యూసఫ్ కుమార్తె షేక్ పర్వీన్‌కు నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. జంతుశాస్త్ర విభాగంలో డాక్టర్ కె.వీరయ్య పర్యవేక్షణలో 'చేపల జీవరసాయనిక క్రియల్లో ఎంజైమ్‌ల పాత్ర'పై ఆమె పరిశోధన చేశారు. అందుకు గాను విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందజేసింది. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.

రైతులకు పొలంబడి



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

కొడవలూరు: మండలంలోని నార్థురాజుపాళెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి మాట్లాడుతూ వరి పంటలో ఆకు ముడత తెగులు ఉన్నందున వెంటనే నివారించుకోవాలని రైతులకు సూచించారు. వేప గింజల కషాయం తయారీ, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏ డి.శివజ్ఞాన, రైతులు పాల్గొన్నారు.


డిగ్రీ కళాశాలకు నాక్ బి-ప్లస్ గ్రేడ్



హర్షం వ్యక్తం చేస్తున్న అధ్యాపక బృందం

కోవూరు(విడవలూరు): విడవలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బి-ప్లస్ గ్రేడ్ వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సుజాత తెలిపారు. శుక్రవారం ఆ కళాశాలలో పిన్సిపల్ మాట్లాడుతూ గత నెల నాక్, పీర్ బృందం కళాశాలను పరిశీలించిందని, వారు అందించిన నివేదికతోపాటు కళాశాలలో ఉత్తమ బోధన, పరిసరాల పరిశుభ్రత, ఇతర అనుకూలతను పరిగణనలోకి తీసుకొని గతంలో ఉన్న బి గ్రేడ్‌ను మార్చి బి-ప్లస్ ఇవ్వడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మధు, డాక్టర్ ఐఎస్ చక్రపాణి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జేడీ విచారణ



మాజీ సర్పంచ్ కిరణ్‌తో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సుబ్బారావు

మనుబోలు: మండలంలోని అక్కంపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు దాత పేరు పెట్టేందుకు శుక్రవారం ఆర్‌జేడీ సుబ్బారావు విచారణ చేపట్టారు. జీఓ నంబర్ 162 ప్రకారం రూ.10 లక్షలు పాఠశాల అభివృద్ధికి దాత ఖర్చు చేసి ఉంటే అతని పేరు పాఠశాలకు పెట్టవచ్చని నిబంధనలు ఉన్నాయని ఆర్‌జేడీ తెలిపారు. ఈ క్రమంలో అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్‌రెడ్డి తన తండ్రి పేరు పాఠశాలకు పెట్టేందుకు గతంలోనే దరఖాస్తు చేసుకుని ఉండగా ఆర్‌జేడీ ఆధ్వర్యంలో విద్యాశాఖాధికారులు విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలిపారు. ఆర్‌జేడీ వెంట డీఈఓ గంగాభవాని ఎస్ఎస్ఏ ఏపీసీ ఉషారాణి, ఎంఈఓలు శేషాద్రివాసు, రమేష్‌కుమార్, నాడు-నేడు ఈఈ శ్రావణ్‌కుమార్, ఏఈ అహ్మద్‌బాషా, మాజీ సర్పంచ్ కిరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

• రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ఇడిమేపల్లి సచివాలయాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడిమేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని మంత్రి కాకాణి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పెద్ద ఎత్తున గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి జాతిపిత మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలని భావించిన గాంధీజీ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని, ప్రకృతి వ్యవసాయరంగంలో భారతదేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రతిష్టాత్మకమైన జైవిక్ ఇండియా అవార్డ్-2023 దక్కిందని తెలిపారు. గత ప్రభుత్వంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అవినీతి అక్రమాలు జరిగాయని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు విస్తృతంగా చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలోనే సర్వేపల్లిని నంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. ఇడిమేపల్లి, రామదాసుకండ్రిగ గ్రామాల రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చి గ్రామానికి వచ్చినట్లు తెలిపారు. ఎన్ని సమస్యలు ఎదురైనా అధిగమించి కనుపూరు కాలువ నుంచి ఇడిమేపల్లి చెరువుకు సాగునీరు తీసుకొచ్చామన్నారు. భవిష్యత్‌లో సాగునీటికి ఇబ్బందులు లేకుండా శాశ్వతంగా కాలువల నిర్మాణం చేపడతామన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం కింద లబ్ధిదారులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ వేమారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, డీపీఓ సుస్మితారెడ్డి, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, ఎంపీటీసీ సభ్యులు వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, రాపూరు అంకయ్య, సర్పంచ్ ఉప్పు యశస్విని, నాయకులు ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, కొనిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, ఉప్పు భూపయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగరతీరాన విజయదరహాసం



విజయోత్సవ సభకు విచ్చేసిన ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు

• కోవూరు నియోజకవర్గంలో 'గడప గడపకు..' కార్యక్రమానికి బ్రహ్మరథం
• లక్ష గడపలు పూర్తి చేసిన ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
• విజయోత్సవ సభలో ఎమ్మెల్యే సేవలను కొనియాడిన ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్



లక్ష గడపల సాధకుడు అంటూ ఏర్పాటు చేసిన హోర్డింగ్

కోవూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అలుపెరగని ప్రయాణంతో, అకుంఠిత దీక్షతో నిర్వహించి లక్ష గడపలను పూర్తి చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గతేడాది ఆగస్టు 1న ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని కోవూరు, కొడవలూరు, విడవలూరు, బుచ్చిరెడ్డిపాళెం మండలాల్లో దిగ్విజయంగా పూర్తి చేసి మైపాడు సాగరతీరంలో లక్ష గడపల విజయోత్సవ సభను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సభకు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో పాటు జిల్లా నలుమూలల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి గత 13 నెలలుగా చేపట్టిన 'గడప గడప మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో పర్యటించిన సమయంలో అభాగ్యులు, అనాథలకు తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించిన చేయూతను, ఆర్థిక సహకారాన్ని, ఇతర సేవ కార్యక్రమాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. సభకు వచ్చిన వేలాది మంది ప్రజలు ఈ దృశ్యాలను వీక్షించి ఎమ్మెల్యే సేవా నిరతిని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేస్తున్న కృషి అంతాఇంతా కాదని సభకు హాజరైన ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల శ్రేయస్సు కోరే ఇలాంటి వ్యక్తులకు తమవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. గతంలో వచ్చిన మెజారిటీ కన్నా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వారు కోరడంతో ఒక్కసారిగా ప్రజల నుంచి హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి.

విజయోత్సవ చిహ్నం

ఎమ్మెల్యే లక్ష గడపలు పూర్తి చేసినందుకు చిహ్నంగా శిలాఫలకం ఏర్పాటు చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. విజయోత్సవ సభ జరుగుతున్న తరుణంలో గంగపట్నం ముఖద్వారం నుంచి మైపాడు బీచ్ వరకు యువనేత దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. సభ ప్రారంభం నుంచి ముగిసే వరకు ప్రజల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. నియోజకవర్గం నలుమూలల నుంచి ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

కామాక్షితాయి సేవలో ఎమ్మెల్యే ప్రసన్న



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తన కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ప్రసన్న, ఆయన సతీమణి గీతమ్మ, కుమారుడు రజత్‌కుమార్‌రెడ్డి, కోడలు పూజారెడ్డిలకు ఆలయ పాలకమండలి చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కుటుంబసభ్యులు గణపతిస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, మల్లికార్జునస్వామి, కామాక్షితాయి అమ్మవార్లను దర్శించుకున్నారు. శ్రావణమాసం నాలుగో శుక్రవారం తన మనుమరాలు ఇదికారెడ్డితో కలిసి తొలిసారిగా ఈ క్షేత్రాన్ని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆలయ చైర్మన్, అధికారులు ఎమ్మెల్యే, కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు మురళి, బాలకృష్ణ, సాగర్, శివకుమార్, కౌన్సిలర్ లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం ఉదయం 9.30 గంటలకు పొదలకూరు పట్టణంలోని మెయిన్‌రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి శుక్రవారం తెలిపారు. అనంతరం మండలంలోని విరువూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు.

కాళోజీకి ఘన నివాళి

వెంకటాచలం: మండలంలోని ఎర్రగుంట వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో శుక్రవారం సాహితీవేత్త కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగుభాషకు కాళోజీ నారాయణరావు చేసిన కృషిని పలువురు వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కుర్రా జితేంద్రబాబు, పరవస్తు నాగసాయి, కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మామిడి మొక్కల పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని వవ్వేరు గ్రామంలో సినార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవల్లిక మాట్లాడుతూ డీఏకే ఆర్థియా సంస్థ సహకారంతో ఎస్సీ, ఎస్టీ రైతులకు మామిడి మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకుడు జవహర్ ఆదేశాల మేరకు వవ్వేరు గ్రామానికి చెందిన కోవూరు వెంకటకృష్ణయ్య అనే రైతుకు ఎకరాకు సరిపడా మామిడి మొక్కలు ఉచితంగా అందజేశామని తెలిపారు. ఈ మొక్కలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఘన నివాళి

బుచ్చిరెడ్డిపాళెం: గరికిపాటి రాజారాం వర్ధంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని దామరమడుగులో ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి గండవరపు శేషయ్య మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గరికిపాటి రాజారాం 'మాభూమి' నాటకం ద్వారా రైతుల్లో చైతన్యం తీసుకువచ్చారని గుర్తుచేశారు. భూమి లేని రైతు కూలీలను పోరాటాల వైపు నడిపించి ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రత్నయ్య, కన్నయ్య, విజయమ్మ, సురేష్, షేక్ బాబు పాల్గొన్నారు.

వేళాంగణిమాత చర్చిలో ప్రార్థనలు



వేళాంగణిమాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న భక్తులు

తోటపల్లిగూడూరు: కోడూరు వేళాంగణి మాత(మరియమాత) ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చర్చిలో జపమాల-నవదిన ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా దైవసందేశకులు వరకుమార్, క్రీస్తు రమేష్, ఆల్ఫోన్స్, విలయం జార్జ్, భాస్కో, శ్రీమణి తదితరులు భక్తులకు తమ సందేశాన్ని వినిపించారు. వేళాంగణిమాతను ఆరాధిస్తే సకల సౌఖ్యాలు సిద్ధిస్తాయన్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో వేళాంగణిమాత చర్చి ప్రాంగణం, కోడూరు సాగరతీరం కిక్కిరిసిపోయింది. చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా చర్చి డైరెక్టర్ లూకాస్‌రాజ్ తగిన ఏర్పాట్లు చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ-2 డిపో నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడిపారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు శనివారం కోడూరు సాగరతీరంలో పుణ్యస్నానాలు ఆచరించనున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీమాధవి

బుచ్చిరెడ్డిపాళెం: వరిసాగు చేసే రైతులు తప్పనిసరిగా పొలంలో భూసార పరీక్షలు చేయించాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఏడీఏ లక్ష్మీమాధవి సూచించారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం రైతులకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయించడం ద్వారా భూమిలోని పోషకాలు తెలుస్తాయని, తద్వారా ఏ వరి వంగడాలు వేస్తే మంచిదో తెలుసుకోవడంతోపాటు భూమిలో పోషకాలు తక్కువగా ఉంటే ఎలాంటి మందులు వాడాలో తెలుసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా వరిసాగు సమయంలో వినియోగించాల్సిన ఎరువుల మోతాదును కూడా ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. తద్వారా రైతులు పెట్టుబడులు తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే రబీలో ఎలాంటి వరి వంగడాలను సాగు చేయాలో, వివిధ యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏఈ లోకేష్, ఆత్మ ఏఓ మధురిమ, మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల భద్రతకు ప్రాధాన్యం

• పోర్టు సీఓఓ సంజయ్



కార్మికుడికి బహుమతి అందజేస్తున్న సీఓఓ సంజయ్

ముత్తుకూరు: ఉద్యోగులు, కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అదానీ కృష్ణపట్నంపోర్టు సీఓఓ సంజయ్ కోత తెలిపారు. 'లైఫ్ సేవింగ్ సేఫ్టీ రూల్స్' కార్యక్రమం ముగింపు సందర్భంగా శుక్రవారం పోర్టులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పనికి ఎంత ప్రాధాన్యం ఇస్తామో.. భద్రతకు అంతకు మించి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఉద్యోగులు, కార్మికులు బాగుంటేనే బాగుంటేనే.. వారి కుటుంబాలు బాగుంటాయని అన్నారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ఆయన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేఫ్టీ హెడ్ రామకృష్ణ, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ గంటా వేణుగోపాల్, అడ్మిన్ ఏజీఎం గంగాసతీష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం



గర్భిణులు, బాలింతలకు సూచనలిస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామని ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం తెలిపారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కొడవలూరు ఎన్టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్‌డీ యాస్మిన్, ఎస్‌కే రమీజా, వై.కామేశ్వరి, పి.శాంతి, ఎస్‌కే ఆఫ్రీన్, కె.నాగరాజ పాల్గొన్నారు. అలాగే మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషక విలువలున్న ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి పోషక విలువలపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వై.సుమతి, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్.పార్వతి పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

మనుబోలు: మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోగలమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని బద్దెవోలు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్తలు సంపూర్ణ, రాధ, ఉమామహేశ్వరి, దొరసానమ్మ, సుబ్బమ్మ, ఆశా కార్యకర్త సుందరమ్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

పొదలకూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని వెంకటాచలం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.జ్యోతిలక్ష్మి సూచించారు. మండలంలోని మొగళ్లూరులో శుక్రవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులు రక్తహీనతను అధిగమించేందుకు రాగులు, జొన్నలు, సజ్జలు, వేరుశనగ చిక్కీలు, ఆకుకూరలు, కోడిగుడ్లు తీసుకోవాలని సూచించారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

కొడవలూరు: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం ఎస్.రుక్మిణి సూచించారు. మండలంలోని నార్థురాజుపాళెంలో ఆహారం, ఆరోగ్యం, పారిశుద్ధం అనే అంశాలపై సంఘబంధం సభ్యులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు శ్రీలక్ష్మి, మణెమ్మ, వీఓఏలు కృష్ణవేణి, కుమారి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆలయాల నిర్మాణం సంతోషకరం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: గ్రామాల్లో ప్రజలు కలిసిమెలిసి ఆలయాలు నిర్మించుకోవడం చాలా సంతోషకరమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తాటిపర్తిపాళెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గ్రామదేవుడు తాటిపర్తయ్యస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీటీడీ ఆర్థిక సహకారంతో సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని గిరిజన కాలనీల్లో పలుచోట్ల ఆలయాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో పలు గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవడం మంచి పరిణామమన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలకు భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, సర్పంచ్ గుమ్మా ప్రసన్న, ఎంపీటీసీ సభ్యుడు శివకుమార్‌రెడ్డి, నాయకులు గుమ్మా మోహన్, డేగా శ్రీనివాసులు, గుమ్మా కిష్టయ్య, మాడ పెంచలయ్య, ఎంపులూరు మోహన్, గుమ్మడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు



విద్యార్థులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొడవలూరు: మండలంలోని నార్థురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర విద్యాసంస్థల ఆవరణలో కొడవలూరు పీహెచ్‌సీ వైద్యబృందం శుక్రవారం విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా హిమోగ్లోబిన్ వృద్ధి చెందుతుందన్నారు. మాత్రలు వాడడంతోపాటు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ప్రిన్సిపల్ వి.అనిల్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రవికుమార్, సీహెచ్ఓ టి.సోమశేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పొదలకూరు: స్థానిక ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి కోర్సుల్లో ప్రవేశానికి నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ జీవీ రమాదేవి శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చని తెలిపారు. సూయింగ్ టెక్నాలజీ, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, హార్టికల్చర్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఎలాంటి కాల్‌లెటర్స్ పంపబోమని, అభ్యర్థులు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పొదలకూరుకు సమీపంలోని చిట్టేపల్లి వద్దనున్న నూతన ఐటీఐ కళాశాల భవనంలో నాలుగో విడత కౌన్సెలింగ్ ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు సూయింగ్ టెక్నాలజీ - 8185088996, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ - 8985119940, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్ - 9494831200, హార్టికల్చర్ - 8886886144 ఫోన్‌నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.